"సమాధులపై సౌధమును నిర్మించవద్దు"

శ్రీమతి తాడి నాగమ్మగారు

హెడ్మాస్టరు—ఏమోయి! రమణారావు! నీప్రత్యర్థి రామారావుకే ఈసారి ఫస్టుమార్కులు వచ్చాయి నీవేమి చదవలేదా?

రమణరావు—ఎంతచదివినా ప్రశ్నపత్రికలు సంగ్రహించుట, అవివీలుకానప్పుడు పుస్తకములుచూచి వ్రాయుట నాచేతకాదులెండి.

హెడ్మా—మొన్నటి పరీక్షలలో ప్రశ్నపత్రికలు దొంగిలించడం, చూచివ్రాయడం కూడానా!

రమణరా—ఏమోలెండి నాకెందుకు? నిజముచెప్పితే నిష్ఠూరం. 'చాడీకోరండి' అని బిరుదులివ్వడం.

హెడ్మా—నీవు తరగతికి పెద్దవై (Monitor) యుండి ఇట్టిసంగతులు చెప్పడానికి భయమెందుకు?

రమణరా—అయ్యా నాకెందుకులెండి? మీరామీరే ఆ విషయంతెచ్చారుకాబట్టి నాహృదయంలో దాగియున్న సత్యం బయటపడింది.

హెడ్మా—నిజముగా అట్లుచేసినట్లు ఋజువున్నదా?

రమణరా—ఏమో నాకెందుకు? మీతో యేదిచెప్పినా ఋజువులు, సాక్ష్యములు, ప్లీడర్లుకావాలి.

హెడ్మా—అట్లయితే రామారావును డిస్మిస్ చేస్తా.

రమణరా—అయ్యోపాపం!! డిస్మిస్ దాకాయెందుకు? ఏదోకొంచెం భయంచెప్పండి.. అయ్యా యిటువంటివారివల్ల స్కూలు పేరుకూడా పాడగును.

హెడ్మా—No. Certainly he should be dismissed

రమణరా—అంతకఠినశిక్ష యెందుకులెండి. మరి... పైగా యీస్కూలునుండి డిస్మిస్ చేస్తే ఇంకొక స్కూలులోమాత్రము చేరి యిట్టిపనులుచేయడా?

హెడ్మా—ఇంక యేస్కూలులోనూ చేరనీకుండగ డిస్మిస్ చేస్తాను. ఈవిషయం డైరక్టరుకు వెంటనే వ్రాస్తాను.

నిరపరాధియగు రామారావు డిస్మిస్ చేయబడినాడు. తలవాల్చుకొనుటకైన తలములేని పేదయతడు. అనాథబాలుడగు నాతడు దిక్కుతెన్నులులేక తల్లడిల్ల సాగినాడు. రమణారావుమోపిన కృత్రిమ నేరము మూలమున అతనిజీవితము అధోగతిపాలైనది. ప్రపంచ నాటకరంగమునందతడు పైకిరాకుండగ రమణారావు జీవముతోనే పూడ్చివేసినాడు. రామారావులేనందువల్ల తనకువచ్చెడి ఫస్టుమార్కులతోను, బహుమతులతోను వృద్ధిపొందసాగినాడు.

* * *

ప్రిన్సిపాల్—రమణారావు! హాస్టలు గొడవలేమిటి?

రమణరావు—ఉన్నవిచెపితే స్టూడెంట్సు చాడీలు అంటారు. చెప్పకుంటే మనకే ముప్పువస్తుంది. నేనేబాధపడగలను చెప్పండి?

ప్రిన్సి—నాతో చెప్పడానికి నీకేమి అభ్యంతరంగలదు?

రమణ—లేదు...కాని-

ప్రిన్సి—ఏం? మోహన్ రావు మరల దెబ్బలాటకు వచ్చాడా?

రమణ—ఒక్కదెబ్బలాట ఐతే అంత యిబ్బంది యేముంది?

ప్రిన్సి—మరింకేమిగలదు?

రమణ—హాస్టలులోనేనా...అయినా నాకెందుకు లెండి.

ప్రిన్సి—హాస్టలుపెద్దవైన నీవుగాక ఇంకెవరికి?

రమణ—ఉండలేక నిజముచెపితే – క్లాసులో అతనికీ నాకు పోటీయగుటచే – అసూయతో చెప్పానంటారు

ప్రిన్సి—అసూయతోచెప్పావని తలచేవాళ్లు నిన్నేమి చేయగలరు? నాతో నిజంచెప్పు.

రమణ—అబ్బా!! నిజంచెప్పేవరకు మీరు చంపుకు తింటారు. పైగా తమవద్దనిజం దాచలేనుకూడాను.

ప్రిన్సి—పరవాలేదు, చెప్పు.

రమణ—మీరు గట్టిగానొక్కి అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నా..... రాత్రి హాస్టలుకుర్రాళ్ళంతా అన్నంతినడం మాని వేసారు.

ప్రిన్సి—ఆం? ఎందుచేత?

రమణ—నేయి మంచిది కాదట. దుర్వాసనట - కూరలో యింకేమిటో లోటట—ఒకటా? బోలెడు.

ప్రిన్సి—ఇవన్నీ యెవరెవరన్నారు?

రమణ—ఇంకెవరు? అన్నిటిలోను అడుగుపెట్టే మోహన్ రావున్నాడుగా.

ప్రిన్సి—ఇంకాయేమిటి?

రమణ—తక్కిన వెందుకులెండి. అవికూడ మీకు తెలిస్తే అసలు మాకే చిక్కువస్తుంది.

ప్రిన్సి—నీకేమిచిక్కు?

రమణ—హాస్టలే యెత్తివేస్తారు.

ప్రిన్సి—అంతప్రబల కారణమేముంది?

రమణ—ఏదో పడుచువాళ్లం కాదా?

ప్రిన్సి—ఐతే?

రమణ—ప్రక్కనే ఆడపిల్లల హాస్టలుంది. ఇంకేమి కావాలి?

ప్రిన్సి—ఏమిజరిగింది?

రమణ—ఏమీ జరుగలేదులెండి...మరి...అయినా ...నా...కెందుకులెండి.

ప్రిన్సి—నీవేమీ దాచవద్దు. నాదగ్గరకూడా దాపరికమా?

రమణ—ప్రేమలేఖలూ...రాత్రులు విహారములూ... మొదలైనవి.

ప్రిన్సి—లెటర్సు దొరికినవా?

రమణ—కావలసినన్ని. కాని అతని స్వదస్తూరిలో లేవు.

ప్రిన్సి—అతడెవరు?

రమణ—ఇంకెవరంత సమర్థులు?

ప్రిన్సి—మోహన్ రావేనా?

రమణ—ముమ్మాటికిని ... నాకెందుకులెండి మీకంత సంశయమున్నపుడు?

ప్రిన్సి—వానిని డిస్మిస్ చేస్తా.

రమణ—అయ్యోపాపం!! డిస్మిస్ దాకా యెందుకు? ఏకోకాంచెం భయంచెప్పండి...యిటువంటివారి వల్ల కాలేజీ పేరుకూడా పాడగును.

ప్రిన్సి — No. Certainly he should be dismissed.

రమణ—అంతకఠినశిక్ష యెందుకులెండి ...మరి... పైగా యీ కాలేజీనుండి డిస్మిస్ చేస్తే ఇంకొక కాలేజీలోమాత్రంచేరి యిట్టిపనులు చేయుడా?

ప్రిన్సి—ఇంక యేకాలేజీలోను చేరకుండగ డిస్మిస్ చేస్తాను. ఈసంగతి వెంటనే యూనివర్సిటీకి వ్రాస్తాను.

నిర్దోషియగు మోహన్ రావు యేకాలేజీలోను చేరకుండగ డిస్మిస్ చేయబడినాడు. అకస్మాత్తుగ జరిగిన యీఘోరసంఘటనమూలమున మోహన్ రావు మతిపోయినది. పిచ్చివాడై దివారాత్రములు ప్రలాపింప సాగినాడు. వీధివీధుల మైలపేలికలతో సగము దిగంబరుడై యల్లాడుచుండు నాతనిజూచి కంటతడిబెట్టని వారుండరు. నిరపరాధియగు నాయువకుని జీవితము నకస్మాత్తుగ పాతాళమునకుపడద్రోసి మరియొకగోరీని నిర్మించినాడు రమణారావు. మోహన్ రావులేనందు వల్ల రమణారావుకే ప్రథమబహుమతులు, విద్యార్థి వేతనములు రాసాగినవి. ద్విగుణోత్సాహముతో నాతడు ఆవిధముగవచ్చుపేరు ప్రతిష్ఠలకు పొంగిపోసాగినాడు.

*　　*　　*

రత్నమ్మ—హలో! డియర్ రమణారావు. ఎప్పుడు వేంచేశారు మదరాసుకి?

రమణరావు—ఇప్పుడే.

రత్న—త్వరలోనే మాయింటికివచ్చారు. వందనాలు.

"సమాధులపై సౌధమును నిర్మించవద్దు"

రమణ—రత్నం నాకుఅలంకారం కాబట్టిధరించుటకు వచ్చాను.

రత్నమ్మ—మీరు చూపించేదయకు నన్ను నేనేమరచి పోతున్నాను సంతోషపరవశమున.

రమణరా—అయితే అంత యిబ్బందిలేదుగాని మరి నన్నుమాత్రం మరచిపోవద్దు.

రత్నమ్మ—మిమ్ములను మరచిపోవుటకు నేనెంతటి దాన్ని, అందుకు మీరేసమర్థులు.

రమణరా—సమర్థతలేకనే నీకోరకై యింతదూరం పరుగెత్తికొనివచ్చాను.

రత్నమ్మ—కేవలం నాకోరకేవచ్చారా?

రమణరా—మరెందుకు?

రత్నమ్మ—నాబోటి నారీమణులిం కెంతమంది తమకు గలరో!

రమణరా—పరిచయమైన స్నేహితురాండ్రున్నారు. ఉంటేయేం?

రత్నమ్మ—వారినికూడా నావలెనే ప్రేమించారేమో?

రమణరా—అబ్బా! మాటలతో చంపడమేగాని... ఎందుకువచ్చానో? ..ఏమిటో...సంగతులు తెలిసి కొనవుగదా ..ఉస్ ..అబ్బా.

రత్నమ్మ—ఆయాసంగా ఉన్నారేం?

రమణరా—నాలుగువందలమైళ్లు నిద్ర లేకుండగ ప్రయాణంచేసివస్తే ఆయాసంగదూ?

రత్నమ్మ—ఏం పనిమీదవచ్చారు?

రమణరా—పెద్దఉద్యోగంవచ్చింది గాని లాభంలేదు.

రత్నమ్మ—ఏం?

రమణరా—డిపాజిట్టు 400 రూపాయలుకట్టాలి.

రత్నమ్మ—మరికట్టకూడదూ?

రమణరా—డబ్బేదీ?

రత్నమ్మ—ఇదిగో నాబంగారుగొలుసు, గాజులజత. అమ్మి డిపాజిట్టుకట్టండి.

రమణరా—ఇవి లేకపోతే నీయందం చిన్నబోతుంది. అందుకు నాప్రాణం ఓర్చదు.

రత్నమ్మ—ఆ ఉద్యోగంవస్తే యిటువంటి వెన్నో మీరే సంపాదిస్తారు.

రమణరా—ఉద్యోగం రాకపోతేనో?

రత్నమ్మ—అపుడు మీరే నాకలంకారం. త్వరగా పోయి వస్తువులమ్మి డిపాజిట్టుకట్టిరండి.

రమణరా—రత్నం! నీప్రేమకెన్ని యుగాలవరకైనా ఋణపడియుంటాను.

రత్నమ్మ—అబ్బా! పొగడ్తలెందుకు పోయిరద్దురూ.

*   *   *

రమణరా—హలో! డాక్టరమ్మగారు బాగున్నారా?

రాధమ్మ—అంత గొప్పపేరెందుకు 'మంత్రసాని' అని పిలవండి.

రమణరా—మీకు వారికి అట్టే తేడాలేదులెండి.

రాధమ్మ—మీరెప్పుడూ నన్ను పొగడుటేకదూ.

రమణరా—వంట్లో కులాసా ఉందాండి.

రాధమ్మ—మీదయవల్ల.

రమణరా—నా దయకేమిలెండి. భగవంతునిదయ ఉండాలిగాని.

రాధమ్మ—భగవంతునిదయ యెట్లాఉన్నా తమదయ ఉంటేచాలు.

రమణరా—ఏమండీ అట్లా దిగులుగా మాట్లాడు తున్నారు.

రాధ—పెండ్లిగాని నాబోటివనితలకు దిగులులేని విషయమేముంది?

రమణ—మీకేమి లోటుందని దిగులు?

రాధ—భర్తదొరకకపోవడం దిగులుగాదా?

రమణ—ఎన్నిచెప్పినా మీరు నమ్మలేదు?

రాధ—నమ్మియే యీగతి తెచ్చుకొన్నాను.

రమణ—ఏగతి? ఏం అల్లామాట్లాడుతున్నారు.

రాధ—ఏమో! అన్నిటికిని మిమ్మునే నమ్మాను.

రమణ—బలే ఇంక భయమెందుకు?

రాధ—త్వరలోనే కార్యం అయితే మంచిది.

రమణ—అంతతొందరేం?

రాధ—నాకు తొందరలేదుగాని... పరిస్థితులు తెచ్చి పెట్టిన చిక్కుయిది.

రమణ—నీ చిక్కుకేమిగాని... నాది పెద్దచిక్కు.

రాధ—ఏమిటది ?

రమణ—ఉద్యోగంకొరకు 400 రూపాయలు డిపాజిట్టు కట్టాలి.

రాధ—డబ్బులేని చిక్కా?

రమణ—ఔను.

రాధ—నాదగ్గరున్నవి. తీసికొనిపోయి కట్టండి.

రమణ—రాధా! నీ ఋణమెన్నియుగముల వరకైనా రుణపడియుంటాను.

రాధ—పొగడ్తలకేమి గాని వివాహంత్వరగాజరగాలి.

రమణ—ఉద్యోగంవచ్చిన వెంటనే తప్పదు.

రాధ—నిజం చెప్పుతున్నాను. నెలతప్పింది.

రమణ—పరవాలేదు. భారంనాది.

ఉద్యోగం వచ్చినవెంటనే రమణారావు రాధా రత్నమ్మలను మరిచాడు వారికి ద్రోహంచేశాడు. అమాయికలగు వారి ధనరాసులను దోచుకొన్నాడు. కన్యాత్వము చూరగొన్నాడు. తుదకు వారి జీవితములను నాశముచేసాడు. ధనము పోయినందుకును పాతివ్రత్యము చెడగొట్టుకొన్నందుకును రత్నమ్మకు పిచ్చియెక్కినది. నెలలుతప్పిన రాధమ్మ లోకనిందకు జడిసి విషముతో ఆత్మహత్యగావించుకొంది. వారి జీవితములపై మరిరెండు గోరీలు నిర్మించి రమణారావు అభివృద్ధిపొందసాగాడు. నాలుగువందల రూపాయల లంచముతో మంచి ఉద్యోగం సంపాదించాడు.

* * * *

ఉద్యోగి—రమణారావుగారూ! మీకూ వెంకటరావు గారికిని పోటీవచ్చింది. ఇద్దరిలోను ఈ ఆఫీసు మేనేజరుగా యెవరిని నియమించవలెనను విషయం గురించి పైనుండి నాకు వ్రాసారు.

రమణ—ఆఫీసు మేనేజరు పదవి అటుంచి మీపదవికే పోటీ వచ్చేటట్టు ఉంది.

ఉద్యోగి—నాపదవికెట్లు?

రమణ—అదే చిదంబర రహస్యం.

ఉద్యోగి—నాపదవికెవరు పోటీచేస్తున్నారు?

రమణ—మీరు ఆక్టింగ్ ఆఫీసరుగదా, పర్మనెంటుగా రావడానికి మరొకరున్నారు.

ఉద్యోగి—ఎవరు?

రమణ—వెంకటరావుగారే.

ఉద్యోగి—అతడెట్లు నాపదవికి రాగలడు?

రమణ—అతనికి మెడ్రాస్ సెక్రటేరియేట్ లోబంధువులున్నారు.

ఉద్యోగి—ఉంటే మాత్రం?

రమణ—మొన్న వెంకటరావుగారు పదిరోజులు సెలవుపెట్టినారు మీరెరుగుదురా?

ఉద్యోగి—ఔను.

రమణ—అపుడు వారు మెడ్రాస్ వెళ్లి వారిని నేరుగా మీపదవిలో వేయమన్నారట.

ఉద్యోగి—మరియేమైయింది?

రమణ—అపుడు వారి బంధువులే అది వీలుపడదు కాబట్టి మొదట ఆఫీసు మేనేజరైతే తరువాత సంగతి చూస్తామన్నారట.

ఉద్యోగి—తరువాత యేమిచేస్తారు?

రమణ—మేనేజరైన రెండవనెలలోనే మీపదవిలో వేయించే యేర్పాట్లు చేస్తారట.

ఉద్యోగి—నాకు యీచాన్సులో ఫర్మనెంటు కాకపోతే వరల పదిసంవత్సరములవరకు కాదు

రమణ—కాబట్టి యిపుడే మేల్కొండి.

ఉద్యోగి—ఎట్లా?

రమణ—వెంకటరావుగరు మేనేజరు కాకుండా చేయడం.

ఉద్యోగి—యెలాగు?

రమణ—లంచం కేసుకల్పించి పైకి రిపోర్టుచేయాలి.

ఉద్యోగి—దయతో ఆయేర్పాట్లు నీవే చేయాలి.

రమణ—మీరు ఈ అంటేచాలు అంతా నేనే యేర్పాటు చేస్తాను.

ఉద్యోగి—ఏలా చేస్తావో ఒకవేళ అపీలుమీద విచారణకువస్తే అన్నీ దృఢపడాలి.

రమణ—అవన్నీ నేనే యేర్పాటుచేస్తా. మీరు మాత్రం అతడు మేనేజరు కాకుండా చూడాలి.

ఉద్యోగి—నాప్రాణముండగా నేను చూడకపోతానా?

కృత్రిమలంచపు కేసు నిరూపింపబడుటవలన వెంకటరావును ఉద్యోగమునుండి కొంతకాలము బర్తరుఫుచేశారు. జీవితములో అతనికి ప్రమోషను లేకపోవుటయేగాక—అతని స్థానమునుండి తగ్గించి సామాన్యగుమస్తాగా వేసారు. నిర్దోషియగు వెంకటరావు జీవితకాలమంతయు అందే పూడ్చివేయబడినాడు. తాను మేనేజరై అభివృద్ధిపొందసాగినాడు.

*　　　*　　　*　　　*

ఒకడు—బాబూ! యీడిప్యూటి కలెక్టరుగారి పేరేమిటి?

గుమస్తా—రమణారావుగారు.

ఒకడు—వీరి బసయెక్కడ.

గుమస్తా—వంతెన దగ్గరున్న పెద్దమేడ.

ఒకడు—ఎన్నిగంటలకు వారు వెళతారు.

గుమస్తా—ఇన్నిగంటలని చెప్పలేము.

ఒకడు—చీకటిపడేవరకుండెదరా?

గుమస్తా—బహుశః ఉంటే ఉండవచ్చు.

ఒకడు—వెళ్ళేటప్పుడు నడిచివెళ్ళెదరా?

గుమస్తా—చీకటిపడితే నడిచేవెళ్లుతారు. ఇవన్నీ నీకెందుకు?

ఒకడు—వారితో మొరబెట్టుకోవాలి

గుమస్తా—ఏమని?

ఒకడు—నాకొడుకును, నాముద్దుబిడ్డను చంపినవాని కేసు కొట్టివేశారు.

గుమస్తా—కేసుకొట్టివేస్తే యింకేమిచేస్తారు?

ఒకడు—అది ఘోరం! పైగా లంచంతిన్నారట.

గుమస్తా—ఆవిషయం ఎత్తావంటే నిన్ను ఖైదులో వేస్తారు.

ఒకడు—చిత్తం. లంచంగాదుట. కేసుకొట్టివేసినందుకు వారొకమేడకట్టించి దొరగారికిస్తారట.

గుమస్తా—అయితే అందుకేమంటావు?

ఒకడు—నాకొడుకుసమాధిపై వారు సౌధము కట్టించుకొంటారా?

గుమస్తా—అందుకిపుడేమి చేస్తావు?

ఒకడు—వారితో మనవిచేస్తాను.

గుమస్తా—ఏమని.

ఒకడు—సమాధులపై సౌధము కట్టకూడదని.

గుమస్తా—నీయిష్టం—పోవోయి.

ఒకడు—చిత్తం.

*　　　*　　　*　　　*

ఆవేళ యేదోకేసులో తీర్పుచెప్పేసరికి చాలచీకటిపడింది. డిప్యూటికలెక్టరు రమణారావు తీర్పుచెప్పి యింటికి బయలుదేరనాడు. ఇంటికి కిసుమంతదూరములోనుండగ 'దప్'అను శబ్దముతో ఒక దుడ్డుకర్ర అతని శిరస్సుపైబడినది. వెనుకనే వచ్చుచున్న ఇద్దరు బంట్రోతులు పరుగెత్తసాగారు. "సమాధులపై సౌధము నిర్మించవద్దు"అంటూ మరల యొక ప్రేటుపడినది. రమణారావు నేలకూలినాడు. పారిపోయిన బంట్రోతులు పోలీసులతో తిరిగివచ్చారు. తలచితికిన డిప్యూటి కలెక్టరు క్రిందపడియున్నాడు. ఆసుపత్రికి గొనిపోవగ అచ్చట శస్త్రచికిత్స జరిగినది. స్పృహదప్పియున్న రమణారావు "సమాధులపై సౌధములు నిర్మింపవద్దు"అని పలవరించుచుండువాడు. అందుచే గాయము మానిపోవు సరి కాతనికి పిచ్చియెత్తినది. పిచ్చియందు సతతము "సమాధులపై సౌధమును నిర్మించవద్దు"అని పలవరించుచుండును పిచ్చియెత్తుటచే ఉద్యోగము పోయినది. పిచ్చియెత్తిన రమణారావు ప్రేలాడు మైలపేలికలతో వీధివీధుల తిరుగుచు ఇప్పటికిని "సమాధులపై సౌధమును నిర్మించవద్దు"అని నవ్వుచు, ఏడ్చుచు, కిచకిచలాడుచు ఉచ్చరించుచుండును.